క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు


సాయిబాబాకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా బాపూజీనగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రధాన అర్చకుడు సూర్యప్రకాష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి భక్తులు క్షీర, విభూధి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రత్యేక హారతులతో పూజించి, సాయిబాబాను పల్లకీలో ఊరేగించారు. కమిటీ సభ్యులు ఆంజనేయులు, ప్రభాకర్, పైడిరెడ్డి, పనులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్: స్థానిక వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఆస్పత్రి సహకారంతో కీళ్లు, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులపై ఉదయం 6 గంటల నుంచి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ చందూ వంశీకృష్ణ, కార్డియాలజిస్ట్ డాక్టర్ చక్రధర్, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ జి.లావణ్య వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు చేస్తారని ఈ అవకాశాన్ని మురళీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనామృతం

సీతంపేట: శారదా స్వర సంగమం, అన్నమయ్య స్వర అకాడమీ సంయుక్తంగా గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనామృతం ప్రేక్షకులను అలరించింది. గాయకులు, లెఫ్టినెంట్ లోకేష్ పర్యవేక్షణలో సుజన, ఉమాదేవిలు వారి శిష్య బృందంతో కలిసి అన్నమయ్య మధుర గీతాలను ఆలపించారు. లోకేశ్ పాడిన కలగంటి కలగంటి , బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, గోవింద గోవింద కీర్తనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో గాయనీ గాయకులను ఎస్.విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, శారద, ఎం.ఎస్.మాధవ్ ప్రోత్సహించారు.

సిరులతల్లికి తులసీదళార్చన


సహస్ర తులసీదళార్చనలో అమ్మవారు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు

మురళీనగర్: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు మురళీనగర్‌లో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టాయి. టీడీపీ ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి విజయబాబు ఆధ్వర్యంలో 50వ వార్డు అధ్యక్షుడు, జిల్లా పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి ససపల వరప్రసాద్ అధ్యక్షతన దీక్ష ప్రారంభించారు. చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, తెలుగు యువత కార్యదర్శి కుట్టా కార్తీక్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొయిలాడ వెంకటేష్, జిల్లా పార్లమెంటరీ పార్టీ కార్యదర్శులు బొడ్డేపల్లి లలిత, జాన్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కోలా రామారావు, 14, 25, 26, 44, 46, 48 వార్డుల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య సేవలు

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

మురళీనగర్: ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు 49వ వార్డు అల్లూరి సీతారామరాజు నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.పి. నాయుడు అన్నారు. సర్వే ప్రారంభానికి ముందుగా గురువారం ఉదయం 8 గంటలకు ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఆయన సమావేశమై పలు సూచనలిచ్చారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలని, అక్కడికక్కడే బీపీ తదితర పరీక్షలు జరపాలని సూచించారు. గతంలో వారి వద్ద ఆరోగ్య పరీక్షల వివరాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలను నమోదు చేసి టోకెన్లు ఇవ్వాలన్నారు. వీరికి అక్టోబర్ 18న ఏఎస్సార్ నగర్ యూపీహెచ్‌సీ వద్ద నిర్వహించే మెగా మెడికల్ క్యాంపులో ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందిస్తామని చెప్పారు. కిడ్నీ, హార్ట్ తదితర అన్ని రకాల స్పెషలిష్ట్ డాక్టర్లు కేజీహెచ్ నుంచి వస్తారని వైద్యాధికారి నాయుడు తెలిపారు.

49వ వార్డులో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 49వ వార్డులోని 278 నుంచి 285 సచివాలయాల పరిధిలో గురువారం సర్వే ప్రారంభమైంది. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, వలంటీర్ ఒక బృందంగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరించి టోకెన్లు అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.పి.నాయుడు పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. సూపర్‌వైజర్ కుమార్ బృందంతోపాటు సర్వేలో పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. 252 సచివాలయం పరిధి వరాహగిరి కాలనీ–2లో గురువారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు బీపీ టెస్టులు చేసి, మెడికల్ క్యాంప్ జరిగే తేదీని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ రాజకుమారి, వలంటీర్ దివ్యభారతి పాల్గొన్నారు.


49వ వార్డులో ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

55వ వార్డులో..

55వ వార్డు తాటిచెట్లపాలెంలో ఏఎన్ఎం మణి, ప్రమీల, వలంటీర్ జగన్ తదితరులు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పర్యవేక్షించారు. ప్రజలంతా ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.


24వ వార్డులో టోకెన్ అందిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ఆరోగ్య సిబ్బంది

24వ వార్డులో సర్వే ప్రారంభం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రారంభమైంది. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పాల్గొని మాట్లాడుతూ అక్టోబర్ 18న స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తరలిరావాలని ప్రజలకు సూచించారు. ఏఎస్ఎం, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, సుగర్, బ్లడ్, యూరిన్, డెంగ్యూ, మలేరియా, ఫీవర్ టెస్టులు చేసి వారికి కార్పొరేటర్ చేతుల మీదుగా టోకెన్లు అందజేశారు.


వరాహగిరి కాలనీ–2లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


తాటిచెట్లపాలెంలో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న సిబ్బంది

శరవేగంగా ఆకర్ష జోన్ పనులు


నక్కవానిపాలెంలో నిర్మించిన ఆకర్ష జోన్ రోడ్డులో మార్కింగ్

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నక్కవానిపాలెంలోని ఖాళీ స్థలంలో ఆకర్ష జోన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సీతమ్మధార రైతుబజార్ వరకు రోడ్డు వేసి, మార్కింగ్ చేశారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ పరిశీలించి వేగవంతంగా పనులు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నక్కవానిపాలెం నుంచి రైతుబజార్ వరకు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆకర్ష జోన్ పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

15 నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజాస్వామి మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 24 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం దుర్గా హోమం, మహాలక్ష్మిదుర్గమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, దేవీ నవరాత్రుల్లో ప్రతి రోజు అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు వేంకటేశ్వరస్వామికి తిరువీధి, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుం చెల్లించి రసీదు పొందాలని రాజాస్వామి కోరారు.


అలంకరణలో షిర్డీసాయిబాబా

నవయుగ కవి జాషువాకు నివాళి

కంచరపాలెం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం జాషువానగర్‌లోని జాషువా కళా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జ్ విక్టర్ మాట్లాడుతూ కుటిల కులతత్వం, మతోన్మాద దారిద్ర్యంపై స్వానుభవం ఉన్న గుర్రం జాషువా వాటిని రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, టీడీపీ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, యాదవ సంఘం ప్రతినిధి నమ్మి అప్పల సత్యనారాయణ, కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మడి అచ్చిబాబు, జి.వి.రమణ, నాయకులు సోడదాసి సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కణితి సాధురావు తదితరులు పాల్గొన్నారు.


జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, నాయకులు, సంఘ సభ్యులు

ఘనంగా గణేష్ నిమజ్జనం

సీతంపేట: బాల గణేశ వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ అనుపు మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి మేళతాళాలు, డీజే సౌండ్స్‌తో భారీ ఊరేగింపుగా స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లారు. యువత డ్యాన్స్‌లతో కేరింతలు కొట్టారు. దారిపొడవునా ప్రసాదం పంపిణీ చేశారు.


ఊరేగింపులో గణనాథుడి విగ్రహం

రోడ్డుపై 'కీప్ లెఫ్ట్' సూచికల ఏర్పాటు

మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద కీప్ లెఫ్ట్ లెటర్స్, యారో మార్క్ పెయింటింగ్స్ వేశారు. జాతీయ రహదారిపై అందరూ లేన్ డిసిప్లిన్ తప్పక పాటించి, ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ఏసీపీ సూచించారు. చిన్న వాహనాలు ఎడమ వైపు ప్రయాణించాలనే విధంగా పెయింటింగ్‌తో వాహన చోదకులకు సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డుపై కూడా ఈ ప్రక్రియ మొదలుపెడతామని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. కియా షోరూం సీఈవో శ్రీనివాసరావు, మేనేజర్ నరేష్ సౌజన్యంతో పెయింటింగ్స్ సమకూర్చామని సీఐ చెప్పారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.



తాటిచెట్లపాలెం హైవేపై కీప్ లెఫ్ట్ మార్క్ వద్ద ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ అప్పారావు

భక్తిశ్రద్ధలతో దీపారాధన

సీతంపేట: స్థానిక గణేష్‌నగర్‌లో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి దీపారాధన నిర్వహించారు. ఉప్పుతో వినాయక రూపాన్ని తీర్చిదిద్ది చుట్టూ మహిళలు దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప్పాడ సన్నీ, వెంకటేష్, శివ, పండు, అప్పలరాజు, మధు, ఉదయ్, అశోక్ పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లో వినాయక మండపం వద్ద దీపారాధన

ముస్లింల శాంతి ర్యాలీ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో మహమ్మద్ ప్రవక్త జన్మదినం ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మర్రిపాలెం మస్జిద్ ఈ అల్ వతా, జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో నాతేకలంలు ఆలపిస్తూ ముస్లిం మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ చేశారు. పాత పోస్టాఫీస్ వద్ద ఇసాక్ మదీనావలీ మజార్ షరీఫ్ వరకు ర్యాలీగా వెళ్లి మజార్ వద్ద చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించామని కమిటీ సభ్యులు తెలిపారు. అంతకముందు ముస్లింలు మసీద్ ప్రాంగణంలో ఖురాన్ పఠించి ప్రత్యేక నమాజ్‌లు ఆచరించి ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ ఆయన బోధనలను సార్థకం చేయాలని మత గురువులు హితవు పలికారు.


జాకీర్‌హుస్సేన్ నగర్ మసీద్ వద్ద శాంతి ర్యాలీ ప్రారంభిస్తున్న ముస్లింలు

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార: గుర్తు తెలియని ఒక యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా.. అక్కయ్యపాలెం హైవేలో పాత బస్టాప్ దరి ఒక మర్రి చెట్టుకు గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో కేబుల్ వైర్లతో ఉరివేసుకుని ఒక యువకుడు మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గమనించి డయల్ 100కు కాల్ చేశారు. ఫోర్త్‌టౌన్ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువకుడి మృతదేహాన్ని చెట్టుపై నుంచి కిందకి దించి చెక్‌చేశారు. మృతుడి జేబులో ఒక లైటర్ మాత్రమే ఉంది. దుస్తులు పూర్తిగా మాసిపోయినట్లు గుర్తించారు. యువకుడి వయసు 28 నుంచి 30 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం యువకుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. యువకుడు ఒడిశా ప్రాంతానికి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.


అక్కయ్యపాలెం హైవే దరి పాత బస్టాప్ వద్ద యువకుడి మృతదేహం

మొక్కల సంరక్షణకు చర్యలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యవేక్షణలో గురువారం పార్కులోని మొక్కల ప్రూనింగ్, చెత్త, కలుపు మొక్కల తొలగించడం, దోమల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు సహకరించారు.


వాకర్స్ పార్కులో మొక్కలు కత్తిరిస్తున్న నిపుణుడు

కాళీ కాలభైరవుల కల్యాణోత్సవం నేడు

సీతంపేట: భాద్రపద పౌర్ణమి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి దివ్య సమక్షంలో కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నూనెల పోలారావు ప్రమాణ స్వీకారం

తాటిచెట్లపాలెం: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ విశాఖ సిటీ చైర్మన్‌గా తాటిచెట్లపాలేనికి చెందిన నూనెల పోలారావు ఇటీవల నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం రైల్వే న్యూకాలనీలోని ఫంక్షన్ హాల్‌లో ఆయన ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో పోలారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీని బలోపేతం చేస్తానని పేర్కొన్నారు. జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల్లో బీసీ సెల్ కమిటీలను త్వరలో నియమించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ మూల వెంకటరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం అందించిన సేవలకు గాను అధిష్టానం ఈ పదవి ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఎస్.మణికంఠకుమార్, పార్టీ నాయకులు ఐ.ఎర్రయ్య, డి.నూకరాజు, గొంప శ్రీధర్, నంబారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఓబీసీ సెల్ సిటీ చైర్మన్ నూనెల పోలారావు

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తిక్కవానిపాలెం వాడపేటలో అమ్మమ్మతో కలిసి నివసిస్తున్న వాసుపల్లి రోహిత్ కుమార్(11) సీతమ్మధారలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు బస్సు కోసం అమ్మమ్మతో కలిసి రోడ్డు మీద వేచి ఉండగా.. తాటిచెట్లపాలెం నుంచి బిర్లా వైపు సర్వీస్ రోడ్డులో వేగంగా వస్తున్న బైకు బాలుడిని ఢీకొనడంతో కుడి భుజానికి గాయమైంది. గురువారం బాలుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

వార్డుల్లో అన్నసమారాధనలు


54వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, గుజ్జు వెంకటరెడ్డి


51వ వార్డులో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


26వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు వార్డుల్లో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో సాయి సంపత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నదానాన్ని ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా వినాయకుడికి పూజలు చేసారు. కార్యక్రమంలో బొడ్డేటి కిరణ్‌కుమార్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

51, 46, 54 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ వుడా క్వార్టర్స్‌లో శ్రీ వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదానాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

- 46వ వార్డు శాంతినగర్‌లో డేంజర్ బాయ్స్ ఆధ్వర్యంలో, 54వ వార్డు 104 ఏరియాలో వేమన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆ పార్టీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, 46వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

హైవేపై పల్టీలు కొట్టిన కారు

మర్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం పెద్ద ప్రమాదం తప్పింది. తాటిచెట్లపాలెం హైవే మీదుగా కంచరపాలెం వైపు వస్తున్న కారును వెనుక నుంచి వస్తున్న లారీ అధిగమించే క్రమంలో ఒక్కసారిగా తగలడంతో.. కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. కారులో ఉన్న ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ ఇద్దరు మహిళలను చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో నుజ్జయిన కారు